# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

1

## నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం | నవంబర్ 10, 2024 | www.navatelangana.com


## పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించాలి

- బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి



మాట్లాడుతున్న సివిల్ కోర్టు జడ్జి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాన్సువాడ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి టీఎస్పీ భార్గవి తెలిపారు. శనివారం బాన్సువాడ కోర్టులో జాతీయ న్యాయ సేవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవ దినోత్సవం పురస్కరించుకొని ప్రజలకు సత్వర న్యాయం కలిగేలా చూడాలని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు రమాకాంత్, భూషణ్ రెడ్డి, మోహన్ రెడ్డి, దత్తాత్రేయ, ఖలీల్, మొగులయ్య, కోర్టు సిబ్బంది శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ విక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి

ఈ నెల 9, 10 తేదీల్లో ఓటు నమోదు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. శనివారం ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం నిర్వహించ తలపెట్టిన తేదీల్లో తమ తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలున్నారు.

## నేడు కందకుర్తికి హర్యానా గవర్నర్ రాక

- రూట్ మ్యాప్‌ను పరిశీలించిన ఏసీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో మహా హారతితో పాటు, కందకుర్తి గ్రామంలో నిర్మాణంలోనున్న స్మృతి మందిరం, స్కంద మాత ఆలయాలను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించనున్నారు. అందులో భాగంగా ఆయనను ఘన స్వాగతం పలికేందుకుగానూ రూట్ మ్యాప్‌ను ఏసిపి శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, రెంజల్ ఎస్సై ఈ.సాయన్న క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆయనకు స్వాగతం పలకనున్నట్లు వారు పేర్కొన్నారు. కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద మహా హారతి కోసం వారు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు.

## సర్వేలో పక్కా సమాచారం సేకరించాలి

- జిల్లా ప్రత్యేక అధికారి శరత్



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక కుల సర్వేలో అధికారులు పక్కా సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా ప్రత్యేక అధికారి శరత్ తెలిపారు. శనివారం మండల కేంద్రంతో పాటు బస్వాపూర్ గ్రామంలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేస్తున్న సర్వే తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్వో శివ ప్రసాద్, మండల ప్రత్యేక అధికారిని రజిత, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దయాకర్, మహేష్‌గౌడ్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## మత్స్యకారుల జీవనోపాధికే చేప పిల్లల పంపిణీ

- మత్స్యశాఖ ఏడీ ఆంజనేయ స్వామి



చేపపిల్లను విడుదల చేస్తున్న ఏడీ

నవతెలంగాణ-మెండోర

మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడానికే ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్యశాఖ ఏడీ ఆంజనేయ స్వామి, ఎంపిడిఓ వనజ అన్నారు. శనివారం సోన్‌పేట్ గ్రామంలోని ఊర చెరువులో 28,550 ఉచిత చేపపిల్లల విడుదల చేశారు. గంగపుత్ర సభ్యుల సమక్షంలో ఆరోగ్యమైన చేప పిల్లలు లెక్కించుకొని వదిలినట్లు తెలిపారు. నిండిన అన్ని చెరువులు, కుంటల్లో ఉచిత చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు వివరించారు. చేప పిల్లల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు సోన్‌పేట్ నారాయణ, మాజీ అధ్యక్షులు అంజి, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి గడువు పొడిగింపు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతి ఖాళీల భర్తీకి దరఖాస్తు గడువును నవంబర్ 19వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ సత్యవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అలాగే పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రవేశ పరీక్ష 8 ఫిబ్రవరి 2025న నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. Https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంత విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.



రోడ్డుపక్కన ఏర్పడిన గుంత

## ప్రయాణం.. ప్రమాదం

- ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలోని ప్రతి గ్రామపంచాయతీకి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లా, మండల, గ్రామాలలో ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చేందుకుగానూ ప్రభుత్వం టీఫైబర్ ద్వారా పనులను చేయిస్తోంది. అయితే పనుల్లో భాగంగా బీటీరోడ్డు పక్కనే పైప్‌లైన్ కోసం గుంతలు తవ్వుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డుకు మీటర్‌నర దూరం వదిలి.. పైప్‌లైన్ గుంతను తవ్వాలి. కానీ కనీసం మీటర్ దూరం కూడా వదలకుండా నిబంధనలను విరుద్ధంగా గుంతలు తవ్వడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్టు మాచారెడ్డి మండల చుక్కాపూర్ గ్రామస్తులు పేర్కొంటున్నారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డు పక్కన గుంతలు తీసినా.. ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈ మోహన్‌ను వివరణ కోరగా.. 'పనులను వెంటనే నిలిపివేస్తామని. మా అనుమతి తర్వాతనే వారు పనులు చేసే విధంగా చూసుకుంటాం'. అని తెలిపారు.

## ప్రజల కోసం 'పబ్లిక్ సేఫ్టీ క్లబ్బులు'

- అంబాసిడర్‌గా కళాశాల విద్యార్థుల ఎంపిక
- ఆరు విభాగాల్లో క్లబ్బుల ఏర్పాటు
- వాటి పనితీరును వివరించిన కలెక్టర్, ఎస్పీ




మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజల కోసం 'పబ్లిక్ సేఫ్టీ క్లబ్బులు' ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. కళాశాల స్థాయి విద్యార్థిని విద్యార్థులకు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్స్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలో గల సత్య కన్వెన్షన్ హాల్లో పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్స్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్ అనే కార్యక్రమాన్ని ప్రజల కోసం ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిలో భాగంగా ఆరు అంశాలు కూడా చదువుకునే వయసు నుంచి అవలంబించుకుంటే విద్యార్థులు మంచి నడవడికతో పాటు తన చుట్టుపక్కల వారిని కూడా అదే పద్ధతిలో నడవడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. అంబాసిడర్‌గా ఎంపికైన విద్యార్థులు అదృష్టవంతులుగా భావించి బాధ్యతాయుతంగా మెలిగి తమ కళాశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ ఆరు క్లబ్బుల అంబాసిడర్స్ ఆరు విభాగాల్లో పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో విద్యార్థులను, యువకులను సేఫ్టీ అంబాసిడర్‌గా ఎంచుకోవడానికి ముఖ్య కారణం.. ఈ వయసులో సమాజానికి ఏదైనా మంచి పనిచేయాలనే బలమైన ఆలోచనతో పాటూ వారు చెప్పే ప్రతి మాటలు సమాజం వింటుందని, అందులో భాగంగానే ఈ సేఫ్టీ అంబాసిడర్లుగా నియమించినట్టు తెలిపారు. 1. సైబర్ సేఫ్టీ క్లబ్, 2.రోడ్ సేఫ్టీ క్లబ్, 3.ఉమెన్ సేఫ్టీ క్లబ్, 4.ఆంటీర్యాగింగ్, ఆంటీ డ్రగ్ కమిటీ క్లబ్, 5.సోషల్ రెస్పాన్సిబిలిటీ క్లబ్ 6. హెల్త్ అండ్ వెల్నెస్ క్లబ్.. ఇలా ఈ 6 సేఫ్టీ క్లబ్‌లో 6గురు విద్యార్థులు, 4 గురు తల్లిదండ్రులు, 1 కళాశాల అధ్యాపకులు లేదా ఫ్యాకల్టీని తీసుకున్నట్టు తెలిపారు. ఇలా 21 కాలేజీల నుంచి ఈ ఆరు సేఫ్టీ క్లబ్ సుమారు 1000కి పైగా నియమించినట్టు తెలిపారు. ఈ అవగాహన ద్వారా వీరు పూర్తిగా నేర్చుకుని తర్వాత ఈ విద్యార్థులు వారి కళాశాలలో జరిగే కార్యక్రమాలలో అందరికీ ఈ ఆరు విషయాలపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రెగ్యులర్‌గా నిర్వహిస్తూ అందరికీ అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు, సిఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, ఎస్ఐలు, సందీపనీ కళాశాలల డైరెక్టర్ బాలాజీ రావు, ఆర్కే గ్రూప్ కళాశాల సీఈవో డాక్టర్ జయపాల్‌రెడ్డి, మంజీరా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సర్వేల ఆధారంగానే ప్రభుత్వ పథకాలు



సర్వే రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగానే ప్రభుత్వ పథకాలు అమలు కానున్నాయని, సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని 79, 81 పోలింగ్ బూతుల్లో ఓటర్ నమో దు కార్యక్రమాన్ని పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా సమాచార సేకరణ తీరును పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి పూర్తి వివరాలను తీసుకొని, సరైన ఫోన్ నెంబర్లను ప్రశ్నావళిలో నమోదు చేయాలని ఎన్యుమరేటర్‌కు సూచించారు. సూపర్వైజర్లు సర్వే తీరును పర్యవేక్షించాలని, ప్రతిరోజు 10 నుండి 15 ఇండ్లను సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, ఎమ్మార్వో సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఎంఈఓ ఆనంద్‌రావు, ఏపీఓ ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ తదితరులున్నారు.

## సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- సమగ్ర సర్వే తీరును పరిశీలించిన ఎమ్మెల్యే



సర్వే ఎన్యుమరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే నిజామాబాద్ జిల్లాలో శనివారం ప్రారంభమయ్యింది. ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. కాగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మండలంలోని అమ్దాపూర్, పట్టణంలోని ఆచన్‌పల్లిలో సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం ఈ సర్వేను ప్రారంభించినట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా ఈ సర్వే ఉపయోగపడుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉపయోగాల కోసం ఈ సర్వే మేలు చేస్తుందని అన్నారు. సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నాయకులు మానాల మోహన్‌రెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్యా దామోదర్, ఎడపల్లి మాజీ జడ్పిటిసి రామ్మోహన్, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినుద్దీన్ తదితరులున్నారు.

## సమగ్ర సర్వేకు పత్రాల కొరత

- ప్రతి మండలానికి 500 సర్వే పత్రాలు
- ఒక్కో ఎన్యుమరేటర్‌కు 5 మాత్రమే
- పత్రాల కొరతతో త్వరగానే సర్వే ముగించిన అధికారులు



బాన్సువాడలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ఇంటింటి సర్వే చేసి అన్నికులాల సామాజిక, ఆర్థిక తదితర అంశాలపై ఖచ్చితమైన లెక్కలు తీసి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని కాంగ్రెస్ సర్కార్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సర్వేను సైతం ప్రారంభించింది. కానీ ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఇంటింటి సర్వేకు అన్నీ ఆటంకాలే ఎదురవుతున్నాయి. సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్లకు సర్వే పత్రాలు కొరత ఉండడంతో శనివారం సర్వే నామమాత్రంగానే కొనసాగింది. ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు 5 నుంచి 7 పత్రాలను ఇవ్వడంతో ఎన్యుమరేటర్లు ఉదయం 10 గంటల వరకే ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేశారు. ఒక్కొక్క ఎన్యుమరేటర్ తన పరిధిలో పది నుంచి 20 ఇండ్లు సర్వే చేయాలని ఆదేశాలున్నప్పటికీ.. సర్వే చేసే పత్రాలు లేకపోవడంతో ఎన్యుమరేటర్లు చేసేదేమీ లేక తలలు పట్టుకున్నారు.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మండలాల్లో ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమంలో సర్వేపత్రాల కొరతతో సర్వే నామమాత్రంగా సాగింది. బాన్సువాడ మండలంలో 101 బ్లాక్‌లు ఉండగా 91 మంది ఎన్యుమరేటర్లకు 11 మంది సూపర్వైజర్లు ఉన్నారు. మండలంలో 12,065 కుటుంబాలు ఉన్నాయి. నసురుల్లాబాద్ మండలంలో 79 బ్లాక్‌లకు గానూ 65 మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్వైజర్లు ఉన్నారు. బీర్కూర్ మండలంలో 69 బ్లాక్‌లకు గానూ 67మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్‌వైజర్లు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేసే ప్రభుత్వ ఉద్యోగులను ఎన్యుమరేటర్లుగా ఏర్పాటు చేసి ఇంటింటికి సర్వే చేస్తున్నారు. సర్వే ప్రారంభం నుంచి ఏదో ఓ చోట ఆటంకాలు జరుగుతూనే ఉన్నాయి.

ఇంటింటికి గుర్తింపు కోసం అంగన్వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శి, బూత్ లెవెల్ ఆఫీసర్లు, కారోబార్లు కలిసి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు వేశారు. మరుసటి రోజు స్టిక్కర్లు వేయడం నిలిపివేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు 6 నుంచి 8 వరకు ఇంటింటికి తిరుగుతూ కుటుంబ యజమాని ఆధార్ నెంబర్‌తో ఇంటికి స్టిక్కర్ వెయ్యడం కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగానే శనివారం సైతం ఇంటింటికి వెళ్లి సర్వే చేయవలసి ఉండగా నేడు ఎనిమిది గంటలకు సర్వేపత్రాలు నామమాత్రంగా అందడంతో సర్వే మధ్యాహ్నం వరకు ముగించారు. బాన్సువాడ మండలానికి 500 సర్వే పత్రాలు రాగా ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు ఐదు చొప్పున పత్రాలను అందజేశారు. అలాగే నసురుల్లాబాద్ మండలంలో 500 సర్వే పత్రాలు రాగా ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు ఏడు చొప్పున పత్రాలను అందజేశారు. బీర్కూర్ మండలంలో 500 సర్వే పత్రాలు రాగా ఒక్కొక్కరికి ఏడు చొప్పున అందజేశారు. దీంతో చేసేదేమీ లేక మధ్యాహ్నం వరకు సర్వే చేశారు. జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర కుటుంబ సర్వే పత్రాలను ప్రతి మండలానికి 500 చొప్పున పంపిణీ చేయడంతో నేడు ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు 5 పత్రాలను ఇచ్చినట్టు బాన్సువాడ డివిజన్ అధికారి తెలిపారు.

## కాలం చెల్లిన పెరుగు విక్రయం



- నిబంధనలు పాటించని మెస్ నిర్వాహకులు
- జిల్లా కేంద్రంలో ఘటన

నవతెలంగాణ-నిజామాబాద్

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట గల ఓ మెస్‌లో కాలం చెల్లిన పెరుగును నిర్వాహకులు శనివారం విక్రయించారు. దాంతో పెరుగును కొనుగోలు చేసిన బాధితురాలు అవాక్కైంది. ఆ పెరుగు ఉపయోగించే గడువు ఈ నెల 6వ తేదీనే ముగిసింది. కానీ నిర్వాహకులు మాత్రం కాలం చెల్లిన పెరుగును యథేచ్ఛగా విక్రయించారు. ఇటీవల నగరంలో ఆహార భద్రత అధికారులు పలు పెద్ద హోటళ్లు, స్వీటు హోమ్‌లలో తనిఖీలు చేసి పెద్దమొత్తంలో నాణ్యతలేని ఆహారాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. అధికారులు ఇంత పెద్దఎత్తున తనిఖీలు చేసి ఆహారాన్ని సీజ్ చేసున్నా.. కొందరు మెస్ నిర్వాహకులు మాత్రం ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఇష్టారీతినా కాలం చెల్లిన ఆహార వస్తువులను విక్రయిస్తున్నారు. ఆహార భద్రత అధికారులు మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించి.. కాలం చెల్లిన ఆహార వస్తువులను విక్రయించే మెస్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోని బోధన్, నిజామాబాద్ ప్రధాన రహదారిపై రైల్వే గేటు దగ్గర రైల్వే శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను ప్రారంభించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా రైల్వే శాఖ అధికారులు మధ్యాహ్నం రెండు గంటలకు పనులు ప్రారంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటన్నరకుపైగా బోధన్ నిజామాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటలపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గతంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేపడితే వారం రోజుల ముందు సమాచారం ఇచ్చేవారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు మరో మార్గం గుండా వెళ్లాలని సూచించేవారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేవారు. ఈసారి అవేవీ లేకుండా అకస్మాత్తుగా పనులు ప్రారంభించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాక్ మరమ్మతులు చేసినప్పటికీ బీటీ రోడ్డుకు సమాంతరంగా కంకర వేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రెండు గంట ల పాటు రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో బస్సులో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే అధికారుల అనాలోచిత పనుల కారణంగా రహదారిపై వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఇకనైనా రైల్వే అధికారులు పనులు ప్రారంభించే ముందు ప్రత్యామ్నా యం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వికలాంగుల కనీస పెన్షన్ రూ.10వేలకు పెంచాలి

- రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య




మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

నవతెలంగాణ-బోధన్

వికలాంగుల పింఛన్లను కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. శనివారం సాలూరా మండల కేంద్రంలో నిర్వహించిన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ రూ.6000 పెన్షన్ పెంపు హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపు కోసం డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచుతామని హామీ ఇచ్చి ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. పెన్షన్ పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా లబ్దిదారులను మోసం చేస్తుందని విమర్శించారు. పెన్షన్ పెంపుతో పాటు ఇతర హామీల అమలు కోసం డిసెంబర్ నెలలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖలో సమస్యలు పేరుకుపోతున్నాయని అన్నారు. 33 జిల్లాలో ఇంచార్జి అధికారులతో వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేస్తూ గత ప్రభుత్వం జీవో ఇచ్చిందని దానిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖలో అవసరమైన స్టాఫ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో వికలాంగుల పరికరాలు తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమలు చేస్తామని అన్నారు. జిల్లాలో వికలాంగులకు ఉపాధి హామీలో భాగంగా జాబ్ కార్డ్స్ జారీ చేసి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లల్లో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బస్వారాజు పాటిల్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా నాయకులు వై.గంగాధర్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి డి.సాయిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.కవిత, బి.సంగప్ప, ఉమ్మడి జిల్లా నాయకులు రాంపటేల్, నజీర్, కృష్ణ, ఈ.గంగారాం, గోపాల్, సంగీత, రాకేష్ వర్మ, లక్ష్మి, భాను, గంగబోయి, సాయమ్మ, సాయిలు, లకన్‌సింగ్, సురేష్, నారాయణ, సంగ్రామ్, సాగర్ బాయి, దత్తు, కృష్ణ, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | నవంబర్ 10, 2024 | www.navatelangana.com


## బ్యాంకు నిర్మాణం కోసం విరాళాల సేకరణ

**నవతెలంగాణ-మోపాల్**

మండలంలోని మంచిప్ప గ్రామంలో బ్యాంక్ నిర్మాణంకోసం గ్రామ విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. ముఖ్యంగా కాల్పోల్ గ్రామవాసి వీరన్న లక్ష రూపాయలు, కేతావత్ నరేందర్ 51వేలు విరాళంగా అందించారు. దీనికి గ్రామ అభివృద్ధి కమిటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వెంకట్రామ్, మాజీ ఉపసర్పంచ్ జగదీశ్, ముత్యం రెడ్డి, తూర్పు రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


విరాళం సేకరిస్తున్న గ్రామ విలేజ్ కమిటీ

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-మాక్లూర్**

మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ కురుమ గత బుధవారం గుండె పోటుతో మరణించారు. శనివారం వారి కుటుంబానికి జిల్లా కురుమ సంఘం తరపున రూ. 11 వేలు, అత్యవసర సహాయం కింద మండల, జిల్లా యూత్ సంఘం కులబాంధవుల తరపున రూ. 15 వేలు సహాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల కురుమ సంఘం నాయకులు గణేష్, అశోక్, పోతన్న, గంగాధర్, రవి, సతీష్, జవహర్, లక్ష్మణ్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న కురుమ సంఘం

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగేష్ రెడ్డి


సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

పేదలు, నిరుపేదలు, రైతులు, యువత, ఉద్యోగులు అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని, దానిలో భాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటిపల్లి నాగేష్ రెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి గ్రామంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కాట్పల్లి నాగేష్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి మాజీ ఎంపీపీ నర్సయ్య, మోపాల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారెడ్డి, పి.లక్ష్మయ్య మాజీ సర్పంచులు డి.సాయిలు, పి.మధు కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాలోత్సవాన్ని విజయవంతం చేయాలి

- పిడిఎస్‌యూ


మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఈనెల 12 ,13 తేదీల్లో మోపాల్ శివారులోని ప్రెసిడెన్సీ స్కూల్ లో నిర్వహించే బాలోత్సవ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థులను కోరారు. శనివారం డిచ్ పల్లి మండల కేంద్రంలో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జిజ్ఞాసను పెంచుకోవడానికి, సృజనాత్మకతను వెలికి తీయడానికి బాలోత్సవ కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు. మన దేశంలో సైంటిస్టులు, మేధావులు లక్షల సంఖ్యలో తయారు కావలసిన అవసరం ఉందని అన్నారు. ఆ వైపుగా విద్యార్థులు అడుగులు వేయాలని, ఈ కార్యక్రమాలను 7 నుండి 10 తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు కూడా విద్యార్థులను స్వచ్ఛందంగా బాలోత్సవ కార్యక్రమానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, తెలంగాణ యూనివర్సిటీ నాయకులు రవీందర్, అక్షయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదు చేయించుకోవాలి


ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్ పీరియడ్‌లో భాగంగా ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో రెండు రోజులపాటు ఈ ఓటర్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు కొత్త ఓటర్ నమోదు కోసం, మార్పులు చేర్పుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన ఓటరు ఎవరైనా ఉంటే వారికి వారి ఓటు హక్కు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించి, వారితో ఫారం నెంబర్-6లో దరఖాస్తు చేయించాలన్నారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే వారి కోసం ఫారం నెంబర్-6, ఓటర్ కార్డులో ఏదైనా తప్పులు దొర్లితే దాన్ని సరిదిద్దుకొనుటకు ఫారం నెంబర్-8, ఎవరైనా మరణించిన, శాశ్వతంగా షిఫ్ట్ అయిన వారి కోసం ఫారం-7ని అప్లై చేయించాలని సూచించారు. ఏ రోజు దరఖాస్తులను ఆ రోజే ఆన్ లైన్ చేయాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. ఆన్ లైన్ చేసిన వాటి యొక్క ఫిజికల్ కాపీలు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు నరేందర్, సరిత, శోభ, బాజీ సాబ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేషన్ హౌస్ ఆఫీసర్‌కు సన్మానం

**నవతెలంగాణ-ఆర్మూర్**

నూతనంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ బాధ్యతలు చేపట్టగా పట్టణ సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ శనివారం సన్మానించినారు. మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి ప్రబోధకులు గౌతమ్ బుద్ధుని విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పట్టణ ప్రజలకు రక్షణగా నిలుస్తానని తెలిపి, పట్వారి తులసి సేవలు అభినందనీయమని, ఎల్లప్పుడు సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలయాపన ఇంకెంతకాలం?

- జీజీహెచ్ డైట్ సప్లై టెండర్ పూర్తిఎప్పుడు?
- నాలుగు నెలలు అవుతున్నా ఫైనల్‌కాలే?

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్ టెండర్లను ఫైనలైజ్ చేయడానికి ప్రభుత్వ అధికారులకు సమయం దొరకడం లేదా... అని టెండర్‌లో పాల్గొన్న టెండర్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు ఫైనలైజ్ చేయడానికి అధికారులు ఇంకెంతకాలం సమయం తీసుకుంటారని టెండర్‌దారులు ఆవేదనతో ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ డైట్ (రోగులకు అందించే ఆహారం) టెండర్లలో రోగులకు నాణ్యమైన ఆహారం అందించే విషయంలో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు రోగుల క్షేమం కోరుకుంటున్నప్పటికీ ఇంకా ఇంత ఆలస్యానికి గల కారణాలు ఏమిటని వెయ్యి డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతుందని వారు అంటున్నారు. జీజీహెచ్‌లో డైట్ టెండర్లు జులై 12 నుంచి 16 వరకు దరఖాస్తులు తీసుకొనే అవకాశం కల్పించినప్పటికీ ఆ సమయాన్ని కూడా నాలుగు రోజులు పెంచి జూలై 20 వరకు దరఖాస్తులు స్వీకరించే అవకాశం కల్పించారు. అది అంతా పూర్తయి జూలై నెలలో టెండర్‌దారులను ఫైనల్ చేయవలసి ఉన్న ఆ సమయాన్ని కూడా పోస్ట్‌పోన్ చేస్తూ ముందుకు సాగదీశారు. అలా ఆగస్టు నెలలో 23న స్క్రూటీని చేయడానికి నిజామాబాద్ జిజిహెచ్ నుంచి బదిలీ అయిన ఏడిని తీసుకురావడంపైన కూడా పలు అనుమానాలకు చర్చలకు తావిచ్చింది. ఆ సమయంలో కూడా టెండర్ దారులు మీరు ఏ విధంగా ఈ టెండర్‌లో స్క్రూటీని చేయడానికి వచ్చారు అని పలువురు ప్రశ్నించారు. టెండర్‌ను పూర్తి చేయడానికి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెల గడుస్తున్నప్పటికీ అధికారులకు సమయం సరిపోవడం లేదని టెండర్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం డైట్ సప్లయ్ చేస్తున్న వారిని కొనసాగించడానికి పలు సమయాల్లో సరైన నాణ్యమైన ఆహారం అందడం లేదని కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన, పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ ఇంకా ఇప్పటికీ ఆ టెండర్ దారుడినే కొనసాగించడం వెనక అసలు ఏమి దాగి ఉందని టెండర్‌దారులు అంటున్నారు. అంతేకాకుండా ఆస్పత్రికి వచ్చిన రోగులు వారి అటెండర్లు కూడా ఇంకోటెండర్ దారుడిద్వారా అయిన నాణ్యమైన భోజనాన్ని అందిస్తే రోగులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు టెండర్ ఫైనల్ చేయాలని అధికారులను కోరుకుంటున్నారు.

ఓ వైపు రాష్ట్రంలో ప్రజా పాలన అని చెబుతున్నప్పటికీ ప్రజలకు ఎటువంటి న్యాయం జరగడంలేదని, ఆసుపత్రికి వచ్చిన రోగులు ఆహారం విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ప్రజాసంఘాలు, ఎన్జీవో సంస్థలు ఆరోపణలు చేస్తున్నారు. గతంలో ఉన్న టెండర్ దారున్నే ఇంకా కొనసాగించడానికి రాజకీయ నాయకులతో పాటు అధికారుల సహకారం ఉందని, అందుకే ఈ గత టెండర్ దారుడిని తొలగించడానికి ఇంకా సమయాన్ని వృధా చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికైనా సమయాన్ని వృథా చేయకుండా ఎవరైతే నాణ్యమైన భోజనాన్ని అందిస్తారో వారికే డైట్ టెండర్‌ని ఇవ్వాలని ఆస్పత్రికి వచ్చిన రోగులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలవారు కోరుకుంటున్నారు. అంతేకాకుండా నిజామాబాద్ జిల్లాలో ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహించిన కఠినమైన చర్యలు తీసుకుంటామని పలు సమావేశాల్లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మీరు ఇప్పటికైనా ఈ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) పైన దృష్టి సారించి ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన ఆహారం అందించే వారికి టెండర్ దక్కేలా చూడాలని, ఎన్నోసార్లు ఈ అంశం పైన చర్చ జరుగుతున్న పత్రికల్లో వస్తున్నప్పటికీ నిజామాబాద్‌కు మంచి చేయాలని కోరుకునే ప్రజా ప్రతినిధులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రికి వచ్చినవారు ప్రశ్నిస్తున్నారు.

# సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

- ఎమ్మార్వో రామేశ్వర్

**నవతెలంగాణ-మోపాల్/జక్రాన్‌పల్లి/మాక్లూర్**

మండల కేంద్రంలోనీ సింగంపల్లి, కులాస్పూర్ గ్రామ పంచాయతీలో సమగ్ర కుటుంబ సర్వేను శనివారం తాసిల్దార్ రామేశ్వర్, మండల విద్యాశాఖ అధికారి గేమ్ సింగ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎన్యుమేరేటర్లు అడిగిన వాటికి సరైన సమాధానాలు ఇస్తూ వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కులాస్పూర్ సెక్రెటరీ హనుమాన్ రాజు, సింగంపల్లి సెక్రటరీ సునీల్, తదితరులు పాల్గొన్నారు

**జక్రాన్‌పల్లి:** మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో శనివారం కుటుంబ సమగ్ర సర్వే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. శుక్రవారం వరకు గ్రామంలో మూడు రోజులు కుటుంబాలకు స్టిక్కర్లను అతికించారు.


మోపాల్: సర్వే పరిశీలిస్తున్న ఎమ్మార్వో


జక్రాన్‌పల్లిలో..

శనివారం నుంచి కుటుంబంలోని ఎంతమంది సభ్యులు ఉన్నారు.. ఎంత భూమి ఉన్నది ఆధార్ కార్డుల వివరాలను సేకరిస్తూ రాజకీయ, ఉపాధి తదితర అంశాల పైన పూర్తి సమాచారాన్ని సేకరించారు. ఒక ఇంటి వద్ద 30 నిమిషాల నుంచి గంట వరకు సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, ఐకేపి సీసీ బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

**మాక్లూర్:** మండలంలోని సింగంపల్లి, మాక్లూర్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను ఆర్డీఓ రాజేంద్ర కుమార్ శనివారం తనిఖీ చేశారు. గ్రామాల్లో కుటుంబ సర్వేను సరిగ్గా చేయాలని అధికారులకు సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం నుంచి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్, తహశీల్దార్ శేఖర్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణ అధికారి డాక్టర్ స్వామిరెడ్డి

**నవతెలంగాణ-మాక్లూర్/జక్రాన్‌పల్లి**

మండలంలోని చిన్నాపూర్ గ్రామాల్లో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారులు డా. కిరణ్ దేశ్ పాండే, ఉమామ సహెర్ అధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణ అధికారి డాక్టర్ స్వామి రెడ్డి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టోకాలు వేయించాలని, ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుందని, అతిజ్వరం కలిలో పుండ్లు, నోటి పండ్లు ఎక్కువగా ఉంటాయని తద్వారా పునర్పుత్ప సామర్థ్యం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎల్ ఓ వినిత, జేవీఓ కల్యాణి, విఏ పాశా గంగధర్, ఓ ఎస్ పుష్ప, హెచ్ ఏ మహేశ్వరి, గోపాలమిత్ర సుధీర్, రైతులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి: టీకాలు చేస్తున్న పశువైద్యాధికారి


మాక్లూర్‌లో..

**జక్రాన్‌పల్లి:** గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ స్వామి రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారని మండల పశువైద్యాధికారి ఆశ్రిత తెలిపారు. మండల పశు వైద్యాధికారి ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ స్వామి రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలో చేపడుతున్న గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలకు కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జక్రాన్‌పల్లిలో 128 ఆవులు, 366 గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా. గంగాధరయ్య, డా. బస్వారెడ్డి, కిరణ్ దేశపాండే, మండల పశు వైద్య అధికారి డా. ఆశ్రిత, జూనియర్ పశువైద్యాధికారి శశికళ, పశు వైద్య సిబ్బంది గోపాలమిత్ర, పాడి రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ వనం దేవిదాసు సేవలు మరువలేనివి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

పద్మశాలీల అభ్యున్నతి కోసం అహర్నిషలు కృషి చేసిన డాక్టర్ వనం దేవిదాస్ సేవలు మరవరానివని జిల్లా పద్మశాలి సంఘం ప్రతినిధులు అన్నారు. డాక్టర్ దేవీదాస్ అడుగుజాడల్లో నడవాలని వారు పద్మశాలీలకు సూచించారు. నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వనం దేవీదాస్ జయంతిని శనివారం జిల్లా పద్మశాలి సంఘ భవనంలో నిర్వహించారు. జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ దేవీదాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు దీకొండ యాదగిరి, అధ్యక్షులు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, పద్మశాలి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.రాజేశ్వరి మాట్లాడుతూ.. డాక్టర్ వనం దేవీదాస్ తాను జీవించి ఉన్నంత కాలం పద్మశాలీల అభివృద్ధి కోసం పరితపించే వారన్నారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని ఆశించే వారన్నారు. పద్మశాలీలు డాక్టర్ దేవీదాస్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అవదూత దశరథం,కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, నగర సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట్ నర్సయ్య,మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రబాగ, తదితరులు పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

## నేషనల్ డ్రాయింగ్ పోటీలు

- వెల్గటూర్ లిటిల్ ఫ్లవర్‌లో


డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**నవతెలంగాణ-మెండోర**

జాతీయ బాలల దినోత్సాన్ని పురస్కరించుకుని "కరూర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో నేషనల్ డ్రాయింగ్ పోటీలు నిర్వహణలో భాగంగా వెల్గటూర్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో నేషనల్ డ్రాయింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 3800 స్కాలర్షిప్ అందిస్తారని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్ పాష మాట్లాడుతూ.. నేషనల్ లెవల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి అన్ని రంగాలలో తీర్చి దిద్దుతు ముందుకు తీసుకు వెళ్ళాలనే ధ్యేయంతో ఈ నేషనల్ లెవల్ పోటీలు నిర్వహించిన కరూర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, చారిటబుల్ ట్రస్టు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## నాణ్యతకు మారుపేరుగా నిలిచిన భువి ఇండస్ట్రీ

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి


వాటర్‌బాటిల్స్ ప్రదర్శిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

నాణ్యతకు నమ్మకానికి మారుపేరుగా భువి ఇండస్ట్రీ వాటర్ ప్లాంట్ నిలిచిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి లో శనివారం భువి వాటర్ ప్లాంట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ధరలో వాటర్‌ను అందించడం గొప్ప విషయమని, వాటర్ ప్లాంట్ ఇండస్ట్రీని స్థాపించిన వ్యవస్థాపకులు మైలారం బాలుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నుభాయ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్జు భాయ్, జిమ్మి రవి, రవీందర్ రెడ్డి, రాజు భాయ్, భుపెందర్, ఫయీమ్ భాయ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుస ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం, మాజీమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కాలనీవాసులు


**నవతెలంగాణ-బాల్కొండ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి బాల్కొండ శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి మండల కేంద్రంలోని తెలంగాణ పంక్షన్ హాల్ నుండి మల్లన్న గుట్ట మీదుగా డబుల్ బెడ్రూమ్ వరకు 2 కోట్ల 65 లక్షల రూపాయలతో బిటి రోడ్డు పనులకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం బి టి రోడ్డు పనులు పూర్తి అయినందున శనివారం కెసిఆర్ కాలనీ వాసులు, బిఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కెసిఆర్,మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి చిత్ర పాటలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు సిరికంటి సాగర్ యాదవ్, సొసైటీ చైర్మన్ సూరజ్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుస నరహరి, కన్న పోశెట్టి, ఫయాజ్ అలీ, ఎం ఏ. షహీద్, చిన్న బాల రాజేశ్వర్, ప్రసాద్ గౌడ్, గాండ్ల రాజేష్, ధర్మాయి రాజేందర్, షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- వెన్ను నొప్పి భరించలేకనే..

**నవతెలంగాణ-మోపాల్**



మండలంలోని న్యాల్కల్ గ్రామానికి చెందిన పల్లె నవీన్ (37) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం నవీన్ ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. చాలా కాలం నుండి తీవ్రమైన వెన్ను నొప్పితో బాధపడేవాడు. గత సంవత్సరం వెన్నునొప్పికి ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. అయినా కూడా వెన్నునొప్పి తగ్గలేదు. వారం రోజుల నుండి విపరీతమైన నొప్పి రావడంతో నొప్పిని భరించలేక శనివారం ఇంట్లో వారికి పొలం దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు, గ్రామ శివారులో గల స్మార్ట్ సిటీ వెంచర్ దగ్గర ఒక ఒర్రెలో తాను కట్టుకున్న లుంగీ తోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. భార్య పల్లె సాత్విక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ చుక్క యదగిరి గౌడ్ తెలిపారు.

## చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డ్ దేవునిపల్లి గ్రామానికి చెందిన నాగం రాధ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని యశోద హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు సురేందర్ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాంధారి మండలం చద్మల్ గ్రామానికి చెందిన బస్సీ సురేందర్ సింగ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు. అనంతరం యశోద ఆసుపత్రి ఎండి, చికిత్స అందించే వైద్యులతో మాట్లాడి ఇరువురికి మెరుగైన చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకల సాయిలు, బీఆర్ఎస్ నాయకులు రాములు, అరవింద్ గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల ఆర్థికసాయం

- ఎమ్మెల్యే ఆదేశాలతో..

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదేశం మేరకు శనివారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురమ సాయిబాబా పరామర్శించి ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఆయన పరామర్శించిన వారిలో అన్నాసాగర్ గ్రామానికి చెందిన రుక్కవ్వ, అజామాబాద్ గ్రామానికి చెందిన పోచమ్మ, రుద్రారం గ్రామానికి చెందిన మానెమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నసాగర్, అజామాబాద్, రుద్రారం గ్రామ కమిటీల అధ్యక్షులు ఉన్నారు.

# ఇద్దరు యువకులు ఆత్మహత్య

- ఇష్టంలేని పెండ్లి చేస్తున్నారని ఒకరు..
- ఆర్థిక ఇబ్బందులతో ఇంకొకరు
- వేర్వేరు చోట్ల మరో ఇద్దరు మృతి

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

మనస్థాపంతో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇష్టంలేని పెండ్లి చేస్తున్నారని ఒకరు బావిలో దూకి ఆత్మహత్య చేసుకోగా.. ఆర్థిక ఇబ్బందులతో మరొకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ రెండు ఘటనలు వేర్వేరు చోట్ల చోటుచేసుకున్నాయి. ఇదిలా ఉండగా.. ప్రమాదవశాత్తు స్నానానికి వెళ్లి ఒకరు మృతిచెందగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి మృతిచెందాడు.


సంపత్ (ఫైల్)


శ్రావణ్ మృతదేహం

**గాంధారి :** మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జువ్వాడి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సంపత్ (22) ఇంట్లో తనకు ఇష్టం లేని వివాహం చేస్తున్నారని ఈ నెల 7న మధ్యాహ్నం ఇంట్లోని ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అదేరోజు రాత్రి వరకు కూడా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాంధారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా శనివారం సాయంత్రం జువ్వాడి గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో ఓ మృతదేహం ఉన్నదని గుర్తించిన గ్రామస్తులు పరిశీలించి చాకలి సంపత్ మృతదేహంగా గుర్తించారు. తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య..**

**సదాశివనగర్ :** ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని భూంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మొగ్గం శ్రావణ్ (24) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక శుక్రవారం గ్రామంలోని చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**నవతెలంగాణ-రామారెడ్డి**

స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన బొల్లారం ఎల్లయ్య (38) శుక్రవారం స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం నీటిపై తేలియాడటంతో భార్య బొల్లారం కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



**నవతెలంగాణ-ఎడపల్లి**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు (45) ఈనెల 6న బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకోవడానికి వెళ్తుండగా.. నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళున్న మహారాష్ట్ర బస్సు బలంగా ఢీకొనడంతో పల్లికొండ సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి బోధన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని కందకుర్తి నుంచి బోర్గాం వైపు వస్తున్న అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో వెళ్లి ఆ ట్రాక్టర్లను బోర్గాం గ్రామ సమీపంలో పట్టుకొని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

## ఎల్లమ్మ పండుగ ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని బొంపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలను శనివారం ప్రారంభించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగించారు. గ్రామంలో నూతనంగా ఆలయం నిర్మించిన నేపథ్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# బీఎల్ఓలు అందుబాటులో ఉండాలి

- తహసీల్దార్ వేణుగోపాల్

**నవతెలంగాణ-పిట్లం**


మాట్లాడుతున్న తహసీల్దార్

మండల బిఎల్ఓలు తమ ఓటర్ నమోదు కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలని తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరల్ ఓటర్ లిస్టులో పేర్లు గల్లంతైన, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటర్ జాబితాలో తమ పేరు నమోదు చేయుటకు గాను ఫామ్ 6, ఓటర్ జాబితాలో అభ్యంతరాలకు ఫామ్ 7, చిరునామా సవరణలు చేసేందుకు ఫామ్ 8లను నింపి బిఎల్ఓ లకు అందజేయాలని ఆయన సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గాను శని, ఆది వారాలలో ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మండలంలోని ప్రతి ఓటర్ నమోదు కేంద్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఓటు హక్కు లేనివారు తమ దరఖాస్తులను అందజేయాలని ఆయన అన్నారు. పూర్తి ఓటర్ లిస్టులు వచ్చే సంవత్సరం జనవరి 5 నాటికి పూర్తవుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శీతల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపై బీఆర్ఎస్, బీజేపీ వైఖరేమిటి..?

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ నేత

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వేపై బిజెపి, బీఆర్ఎస్ పార్టీల వైఖరేమిటో తెలపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ నేత శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 76 సంవత్సరాలుగా దేశ స్వాతంత్ర అనంతరం మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కుల గణన సర్వే జరుగుతున్న వేళ ప్రధాన ప్రతిపక్షాలైన బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటివరకు స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటో స్పష్టం చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల గణన అనేది చారిత్రాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా మమత

**నవతెలంగాణ-తాడ్వాయి**

మండలంలోని సంఘజీవాడి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా మమత ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మండలాధ్యక్షులు వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బాలన్ భాయ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్‌ను పరిశీలించిన ప్రత్యేక అధికారి

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండల కేంద్రంలోని బాలుర బీసీ హాస్టల్‌ను మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంఈఓ యోసఫ్, ఏపీఎం రాజారెడ్డి, వార్డెన్ నరేష్ పాల్గొన్నారు.

## కార్తీక మాసం "ప్రభాత్ పేరి" ప్రత్యేక పూజలు

**నవతెలంగాణ-మద్నూర్**

మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ మందిరంలో కార్తీక మాసంలో "ప్రభాత్ పెరి" కార్యక్రమాన్ని గత 40 సంవత్సరాల నుంచి గ్రామ సాంప్రదాయ ప్రకారం ప్రభాత్ కొనసాగిస్తున్నారు. నిర్వాహకులు గోవింద్ ప్రసాద్ కాకాని, హనుమాన్ శర్మ, కండక్టర్ గంగాధర్, రచ్చ కుశాల్, కె.వెంకటేష్, శంకర్, సంధుర్వర్ డాక్టర్ రమణ, ఊద్రా సురేష్, అనిల్ పరిక్, మొధాని, ప్రభాత్ పెరి తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఇంటింటి సర్వే

- పలుచోట్ల స్టిక్కర్లు అతికింపు పూర్తి..

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**రెంజల్ :** శుక్రవారంతో ప్రతి ఇంటింటికి స్టిక్కర్లు అతికించడం పూర్తి కావడంతో శనివారం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించినట్లు ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ ముని నాయక్, ఎంపీఓ రఫీ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు, సాటాపూర్ గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వారు ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి 75 అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వారు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ గ్రామ కార్యదర్శులు మహబూబ్ అలీ, రాజేందర్ రావు, ఉపాధ్యాయులు లింగన్న, ఆశ్రిత, అంగన్వాడి సావిత్రి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో ఇంటింటి సర్వే..**

**వర్ని :** ఉమ్మడి వర్ని, మోస్రా, రుద్రూర్, చందూర్ మండల కేంద్రాలతో పాటు, గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో ప్రజల వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, తహసీల్దార్‌లు గ్రామాలలో సర్వేను పరిశీలించారు. కుళస్తంగా కుటుంబాల వివరాలు సేకరించాలని సిబ్బందికీ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ రాజేశ్వర్, తహసీల్దార్ సాయిలు, తదితరులు ఉన్నారు.


వర్ని : సర్వే చేస్తున్న అధికారులు

**కుల గణన సర్వేను పరిశీలించిన ఎంపీఓ..**

**లింగంపేట్ :** మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో కుల గణన సర్వేను ఎంపీఓ మలహరి పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వే పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కులగణన సర్వేలో తప్పులు జరగకుండా చూడాలన్నారు. ఒక్కొక్క బ్లాక్‌లో 170 కుటుంబాల సర్వే చేపట్టనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు.

**అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే ప్రారంభం..**

**గాంధారి :** మండలంలోని ఫేస్2లో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఇంటింటి కుటుంబ సర్వేను మండలంలోని అన్ని గ్రామాలలో ప్రారంభించారు. సర్వే జరుగుతున్న ప్రాంతాలను ఎంపిడివో రాజేశ్వర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కార్యాలయ సిబ్బంది, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

**సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించిన అధికారులు..**

**బోధన్ :** సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా పెంటఖుర్ద్ క్యాంప్ గ్రామంలో సర్వేను బోధన్ తహశీల్దార్ విఠల్, ఎంపీఓ మధుకర్ ప్రారంభించారు. ఎన్యుమరేటర్లు చేపడుతున్న సర్వేను వారు పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గంగ శంకర్, ఏఎంసీ చైర్మన్ సంధ్య దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్యుమరేటర్లకు సర్వే పత్రాలు అందజేత..**

**ఎల్లారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక విద్యా ఉపాధి రాజకీయ సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రకాష్, ఎన్యుమరేటర్లకు సర్వే పత్రాలను అందజేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పకడ్బందీగా సర్వే నిర్వహించాలని వారికి తెలిపారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల పరిధిలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన సర్వే పత్రాలను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ఎన్యుమరేటర్లకు అందజేశారు. ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, స్థానిక నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**సర్వేను పరిశీలించిన ఎంపీడీవో..**

**తాడ్వాయి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సర్వేను ఎండ్రియాల్ గ్రామంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ పరిశీలించారు. ఎన్యుమరేటర్‌కు కుటుంబ సభ్యుల సమాచారం తెలుసుకొని నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్, సంతోష్, సాయిబాబా ఉన్నారు.

## ధాన్యం లారీ బోల్తా

**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**

బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ శివారులో ధాన్యం లారీ బోల్తా పడింది. బుడ్మి సహకార సంఘం పరిధిలోని మొగులాన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం లారీ లోడ్ చేసుకుని శుక్రవారం రాత్రి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దుర్కి రైస్ మిల్లుకు తరలిస్తుండగా సోమేశ్వర్ శివారులో మూలమలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది.

## తరాలు మారినా.. సమానత్వం లేదు

- మాస్టియన్ రాష్ట్ర కార్యదర్శి నాగిల్ల నర్సయ్య


నినాదాలు చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-బీబీపేట్**

తరాలు మారినా.. తమకు సమానత్వం లేదని మాస్టియన్ రాష్ట్ర కార్యదర్శి నాగిల్ల నర్సాయ్య, రాష్ట్ర నాయకులు నాగిల్ల కిష్టయ్య, బుద్దుల రమేష్ తెలిపారు. శనివారం మండలంలోని ఇస్సానగర్ రామచంద్రపురం కాలనీలో జిల్లాస్థాయి మాస్టియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. తమకు మాత్రం తరతరాల నుండి ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వాలు అందని ద్రాక్షగానే మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ ఉపకులంలో ఉన్న తమకు ఎలాంటి ప్రాతినిధ్యం దక్కకుండా అణగారిన కులాలలో అధిక సంఖ్యలో ఉన్న కులాలుగా పిలవబడుతున్న, మాల మాదిగ కులాలు తమకు ఉన్నటువంటి హక్కులను దక్కకుండా ఖూనీ చేశారని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ వ్యవహారాలలో పేరుగాంచిన నాయకులు రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన సంక్షేమ పథకాలు తమ జాతి మనుగడకు సంబంధించినటువంటి అభివృద్ధి పథకాలు దరిచేరనివ్వకుండా కుట్రపూరిత వ్యవహారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం తమపై చిన్న చూపు చూడకుండా ప్రత్యేకమైనటువంటి చట్టాన్ని తీసుకువచ్చి తమను సంఘటితం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుద్దుల సాయిలు, బీబీపేట్ మాస్టియన్ కుల జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దుల రాజనర్సు, జిల్లా కోశాధికారి బుద్దుల శంకర్, ఇతర జిల్లాల నాయకులు, రాములు నాగరాజు, దర్శనం శంకర్, రామకృష్ణ, నర్సయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఉపవాస పండుగ కూడిక

**నవతెలంగాణ-పిట్లం**


శాంతి సందేశం వివరిస్తున్న రెవరెండ్ ఎనోస్ పాల్

మండలంలోని తిమ్మానగర్ గ్రామంలో కల్మెల్ టెంపుల్ ఉపవాస పండగ ముగింపు కూడిక పాస్టర్ ఎనోస్ పాల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు ఉపవాస ప్రార్థన దినములను విశ్వాసులకు బోధించారు. తిమ్మానగర్, అంతర్గావ్, కౌలాస్, పిట్లం, కందర్‌పల్లి, బిచ్కుంద గ్రామాల విశ్వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన దైవజనులకు రేవరెండ్ ఎనోస్ ఫాల్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేవరెండ్ దిన్ దాస్ హైదరాబాద్, రెవరెండ్ రమేష్ చంద్ర బెనర్జీ వర్ని, రెవరెండ్ శేఖర్ కంగ్టి, పాస్టర్ డేవిడ్ కందర్‌పల్లి, పాస్టర్ అమృతరావు బిచ్కుంద, పాస్టర్ స్యామియేల్ మాగి, పాస్టర్ కిరణ్ పాల్ పిట్లం, పాస్టర్ థామస్, పాస్టర్ థామస్ రామాయన్ పేట తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీలకు తాటిపత్రిలు, ప్యాడి క్లియర్, మ్యాచ్యూర్ మిషన్ల పంపిణీ


మ్యాచ్యూర్ మిషన్‌ను అందజేస్తున్న షబ్బీర్‌అలీ

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మండలంలోని అన్ని సింగిల్ విండో సొసైటీ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ తాటిపత్రిలు, ప్యాడి క్లియర్, మ్యాచ్యూర్ మిషన్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం తాటిపత్రిలను సొసైటీ కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని, అవసరం ఉన్న రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లాలన్నారు. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దుబ్బాగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది మృతిచెందగా, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందిన వారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాత రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్ రెడ్డి

**నవతెలంగాణ-ముప్కాల్**



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి శనివారం మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గద్దల భూమేశ్వర్ తండ్రి ఎర్రన్న కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సునీల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ చురుగ్గా కొనసాగిస్తున్నాం

- పిప్రి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి



**నవతెలంగాణ-ఆర్మూర్**

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ చురుగ్గా కొనసాగిస్తున్నామని మండలంలోని పిప్రి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి శనివారం తెలిపారు. సొసైటీ పరిధిలో ఐదు గ్రామాలు ఉండగా, మూడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. సుమారుగా 5వేల క్వింటాళ్ల కొనుగోలు చేసినట్టు చెప్పారు. సొసైటీ సీఈఓ హనుమాన్లు, సిబ్బంది పరస్పర సమన్వయంతో అదనపు సిబ్బందిని నియమించుకొని సొసైటీ పరిధిలోని రైతులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్రానికి చెందిన బొట్ల రవి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి ద్వారా మంజూరైన రూ.35 వేల రూపాయల చెక్కును శనివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా నిధులను మంజూరు చేయడంలో కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి శాఖ చైర్మన్ అన్వేష్ రెడ్డితో పాటు బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు మానల మోహన్ రెడ్డిలకు సైతం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందా రవి, కట్ట గోపి తదితరులు పాల్గొన్నారు.

## భీమన్న ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

మండలంలోని చేపూర్ గ్రామ నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భీమన్న దేవుని కళ్యాణం పండగ ఉత్సవాల, కబడ్డీ పోటీల పోస్టర్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్ శనివారం ఆవిష్కరించారు. ఆదివాసి నాయకపోడ్ జిల్లా ఉపాధ్యక్షుడు మూడ అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్న, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మండల నాయకుడు సంఘం ప్రధాన కార్యదర్శి మేడిపల్లి గౌతం, సంఘ సభ్యులు, యువకులు పాల్గొన్నారు. 13 నుంచి బుధవారం గ్రామ శివారులో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 14 న గురువారం స్వామివారి ఊరేగింపు, గంగ స్నానం, 15న స్వామివారి కళ్యాణం, అగ్గిగుండం దున్నుడు, అన్నదాన కార్యక్రమం, కబడ్డీ పోటీలు ఉంటాయని తెలిపారు. ఆదివాసి నాయకపోడు జిల్లాలో ఉన్న యువకులతో టోర్నమెంట్, 17న వనభోజనాలతో కార్యక్రమాలు ముగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తహసీల్దార్ ఆంజనేయులుతో కలిసి పలు గృహాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లు సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా వివరాలు సేకరించాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే జరుగుతున్నందున ప్రజలు తమ ఇండ్లలో అందుబాటులో ఉండి ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌లకు సహకరించాలని కోరారు.

# గాలికుంటు వ్యాధి లక్షణాలు.. నివారణ చర్యలు

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**



పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలు.. నివారణ చర్యలను మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్‌రావు వివరించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన 'నవతెలంగాణ'తో ముచ్చటించారు. దేశవాలి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వివరించారు. దేశవాళీ పశువుల్లో ప్రాణనష్టం అంతగా ఉండదన్నారు. ఈ గాలికుంటు వ్యాధి మార్చి, ఏప్రిల్, ఆగస్టు మాసాలలో ఎక్కువగా వ్యాపిస్తుందని తెలిపారు.

**వ్యాధి ఎలా వ్యాపిస్తుంది?**

గాలికుంటు వ్యాధి ఫికోర్న వీరిడే కుటుంబానికి చెందిన ఆఫ్తోస్ వైరస్ వల్ల సోకుతుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెలు పాల ద్వారా దూడలకు వ్యాపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు ఏమిటి?**



గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్రమైన జ్వరం 103 నుండి 106 డిగ్రీలకు పెరుగుతుంది. వ్యాధి సోకిన పశువుల్లో నోటిలో, చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం వలన అవి మేత, నీళ్లు తీసుకోలేక నిరసించిపోతాయి. నోరు, గిట్టల మధ్యలో బొబ్బలు ఏర్పడడం, రెండు మూడు వారాల్లో అవి చితికి పుండ్లుగా మారతాయి. పశువుల నోటి నుంచి చొంగ కారుతుంది. పాల ఉత్పత్తి తగ్గుతుంది. గిట్టల్లో పుండ్ల వల్ల ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేవు. గాలుకుంటు వ్యాధి సోకిన ఆవుల, గేదెల పాలు తాగిన దూడలు మరణించే అవకాశం ఉంటుంది.

### వ్యాధి సోకిన పశువులకు చికిత్స ఏమిటి?

పశువుల కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగానేట్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా వేప నూనె రాయాలి. పశువుల నోటిలోని పుండ్లకు గ్లిజరిన్, బోరిక్ పౌడర్‌ని కలిపి పూయ్యాలి. పశు



వైద్యాధికారిని సంప్రదించి అవసరమైన యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలి. పశువులకు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా గాలికుంటు వ్యాధి నుంచి రక్షించుకోవచ్చని ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి రాజశేఖర్ రావు సూచించారు.

**గాలికుంటు వ్యాధిని ఎలా నివారించాలి?**

వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. పశువుల పాకని క్రిమిసంహారక మందులతో వాషింగ్ సోడాతో కడగాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలకు తాగించకూడదు. మార్చి-ఏప్రిల్, ఆగస్టు-సెప్టెంబర్ మాసాలకు ముందుగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు (ఫైల్)

## మహిళలను కాపాడుకోవడం, ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- మేయర్ దండు నీతూ కిరణ్

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

మహిళలు ఆరోగ్యంగా అన్ని రంగాలలో ఉన్నప్పుడే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, అలాంటి మహిళలను కాపాడుకోవడం, ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమీపంలో గల స్నేహ సొసైటీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంధుల వనరుల కేంద్రంలో మహిళ సెక్స్ వర్కర్లతో మహిళ సాధికారత మహిళ ప్రాముఖ్యతపై మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైసెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ డీఎఫ్ఓ-హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా నగర మేయర్ దండు నీతూ కిరణ్, ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ-అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ అభిఋవృద్ధిలో మహిళల పాత్ర




మాట్లాడుతున్న మేయర్ నీతూ కిరణ్

కీలకమన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థిక పురోగతిలో మహిళల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళ పురుషులకు ధీటుగా ముందుంటున్నారని తెలిపారు. మహిళ సెక్స్ వర్కర్ల సమస్యలు, వారు ఆర్థిక పురోగతి ఇతర విషయాలను మేయర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమ వంతు బాధ్యతగా మహిళలకు ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, గాంధీ ఆస్పత్రి సిబ్బంది మల్లికార్జున్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులు స్పెషల్ క్యాంప్ డేస్

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- తహసీల్దార్ వెంకట్రావు



మాట్లాడుతున్న తహసీల్దార్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఎస్ఎస్ఆర్ 2024-25లో భాగంగా స్పెషల్ క్యాంప్ డేస్ రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు స్పెషల్ క్యాంప్ డేస్ నిర్వహిస్తున్నట్టు తహసిల్దార్ వెంకట్రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ లలో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని, కొత్త ఓటర్, ఓటర్ తొలగింపు, తప్పుల సవరణ, పోలింగ్ స్టేషన్‌ల బదిలీకోసం ఫారం 6,7,8 అందుబాటులో ఉంటాయని ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవలని సూచించారు.

## చేపల వేటకు వెళ్లి మృతి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**



మృతి చెందిన వెంకట్

జిల్లా కేంద్రంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఓ యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. నగర శివారులోని శాస్త్రినగర్‌కు చెందిన సంపగి వెంకట్(23) తన స్నేహితుడితో కలిసి శుక్రవారం స్థానికంగా ఉన్న జానకంపేట్ రైల్వేస్టేషన్ పక్కన గల కుంటలో చేపల వేటకు వెళ్లారు. రాత్రి వేళ చేపల వేటకు దిగిన వెంకటి ఈత రాక నీటిలో మునిగిపోయాడు. ఆయనతో వచ్చిన యువకుడు భయపడి ఈ విషయాన్ని ఎవరికి చెప్పలేదు. శనివారం ఉదయం వెంకటి కుటుంబ సభ్యులు అతని కోసం ఆరా తీయగా మృతదేహం జానక్కంపేట్ కుంటలో తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని 6వ టౌన్ పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వం పేదల ఇండ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలి

- న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి

**నవతెలంగాణ-ఆర్మూర్**

ప్రభుత్వం పేదల ఇండ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి దాసు అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ పథకంలో ఇండ్లు మంజూరు చేయించాలని కోరారు. పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్‌రెడ్డితో కలిసి పేదల సమస్య పరిష్కారం కోసం సంబంధిత జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి పరిష్కరించాలని దాసు కోరారు. గత బీఆర్ఎస్ పరిపాలనలో ఎమ్మెల్యే పేదల సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చి విస్మరించారని ఆయన తెలిపారు. 2008 నుంచి మామిడిపల్లి పేదలు పూరి గుడిసెలు నిర్మించుకొని అక్కడ నివాసముంటున్నారని అన్నారు. జిల్లా అధికారులు మారుతున్న పట్టాల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్ల పట్టాల సమస్య పట్టించుకుని పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేష్ బాబు, వెంకటేష్, గంగాధర్, రవి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

**నవతెలంగాణ-ఆర్మూర్**

విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పట్టణ సీనియర్ సివిల్ జడ్జ్ నసీం సుల్తానా అన్నారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తామనుకున్న లక్ష్యం కోసం నిరంతరం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగామణి, న్యాయవాదులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సివిల్ జడ్జి

# సంక్షేమ ఫలాలు అందించేందుకే ఇంటింటి సర్వే

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు దిశానిర్దేశం

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వపరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వర్తింపజేయాలనే సంకల్పంతో ఇంటింటి కుటుంబ సర్వే జరిపిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సర్వే విషయంలో ప్రజలు ఎలాంటి అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని, ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి సర్వేను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో యావత్తు దేశానికి స్ఫూర్తిగా నిలిచే మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని జిల్లా కలెక్టర్లను, ఎన్యూమరేటర్లకు ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియపై తన క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రణాళికా శాఖ చీఫ్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయాలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష జరిపారు.హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేసుకుని శనివారం నుంచి ఇంటింటి సమగ్ర సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని అన్నారు. సర్వేపై ప్రజలతో మమేకం అయితే వారి సందేహాలు ఏమిటి అనేవి తెలుస్తాయని, తక్షణమే వాటిని నివృత్తి చేయడానికి చొరవ చూపాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనవకుండా ఎన్యూమరేటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు భాద్యతగా వ్యవహరించాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములు అయ్యేలా వారిని ఆహ్వానించాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించేందుకు సర్వే దోహదపడుతుందని తెలిపారు. హౌస్ లిస్టింగ్ దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే ఆసాంతం పూర్తి అయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్నారని భాగస్వామ్యం అయిన కలెక్టర్లను, ఎన్యూమరేటర్లు ను, ప్రణాళికా శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. ఇంటింటి కుటుంబ సర్వే మన దేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమని, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ సర్వే విజయవంతం చేయాలని అన్నారు. యావత్తు దేశం మన రాష్ట్రం చేపడుతున్న సర్వేను గమనిస్తున్నదని, నిబద్ధతతో సర్వే పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. సర్వే సమాచారం గ్రామ స్థాయిలోని చిట్ట చివరి ఇంటికి చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హెూర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్లతో పాటు అన్ని స్థాయిలలోని అధికారులు సర్వే ప్రక్రియ ను పరిశీలిస్తూ సిబ్బందికి తగు, సలహాలు సూచనలు ఇవ్వాలని, ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు.

వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. సర్వే కోసం జారీ చేసిన బుక్ లెట్ లోని అంశాలపై ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని కలెక్టర్ కోరారు. ప్రజల నుండి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు ఖచ్చిత సమాచారం ఇవ్వాలని అన్నారు. సర్వేపై ఎలాంటి దుష్ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎంపిడిఓ, తహశీల్దార్ల దృష్టికి తేవాలని అన్నారు. సమగ్ర సర్వే నిర్వహించడానికి ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సీపీఓ మల్లికార్జున్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

## అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : టీడీపీ

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్ళాలని, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ ఆధ్వర్యంలో అడ్‌హక్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. మండల, గ్రామాల వారీగా కమిటీలు వేసి సభ్యత్వాలు ఎక్కువ మొత్తంలో వేయాలని దిశ నిర్దేశం చేశారు. 24న పార్లమెంట్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, గోపిడీ రాజన్న, సోమ్ నారాయణ్ రెడ్డి, బొబ్బ నరసింహ రావు, రెంజర్ల సురేష్, జ్యోతి నారాయణ, అంబిక సత్యనారాయణ, వీర చారి, బ్రహ్మానందం చారి, దంతాల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

## ఓటరుగా నమోదు చేసుకోవాలి

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

మండలంలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహసిల్దార్ షబ్బీర్ తెలిపారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి పౌరుడు పౌరురాలు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. . ఈనెల 9,10 తేదీల్లో ఓటర్ నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు మండలంలోని ప్రతి గ్రామంలోని పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఓటరు జాబితాలో తమ పేరు లేకుంటే ఫారం 6,7,8 లను అనుసరించి నమోదు చేసుకోవాలన్నారు.



# 16,17న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- **పాల్గొననున్న 33జిల్లాల క్రీడాకారులు**
- **జిల్లాలో మొదటిసారి నిర్వహణ**

**నవతెలంగాణ-కంఠేశ్వర్/ నిజామాబాద్ సిటీ**

తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 16,17వ తేదీల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హమ్‌దాన్, సెక్రెటరీ చిల్వేరి సత్యనారాయణ, కోశాధికారి గంగా కిషన్ తెలిపారు. శనివారం స్థానిక నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా మొట్ట మొదటిసారిగా రాష్ట్రస్థాయి షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ క్లబ్ అధ్యక్షులుగా ఉన్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు, కలెక్టర్ చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించినట్టు తెలిపారు. ఈ టోర్న మెంట్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్‌లో 8712300347కు సంప్రదించాలని ఆయన కోరారు. ఈనెల 13 వరకు టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల షటిల్ క్రీడాకారులు 35 ఏళ్లకు పైబడి నుంచి 70 సంవత్సరాల వరకు గల క్రీడాకారులు దాదాపు 600 మంది డబుల్స్ షటిల్ పోటీల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు లక్ష రూపాయల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రీడాకారులకు ఉచిత వసతితో పాటు భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ షటిల్ కోర్టుతోపాటు క్యాప్టెన్ హబ్‌లో ఆరు షటిల్ కోర్టులలో ఈ పోటీలను నిష్ణాతులైన కోచ్‌లు రెఫరీలుగా మ్యాచ్ కంట్రోలర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. షటిల్ డబుల్ పోటీలకుగాను వెయ్యి రూపాయల ఎంట్రీ ఫీజు, వారి ఆధార్ కార్డు వయసు ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. 16న జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తారని, 17న సాయంత్రం బహుమతుల ప్రధానం ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కూడా హాజరవుతారన్నారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆయన జిల్లా ప్రజలను కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, భక్తవత్సలం నాయుడు, స్వామిదాస్, దండుస్వామి, ఫైనాన్స్ కమిటీ కో కన్వీనర్ భవంతి దేవిదాస్, ఏటిఎస్ శ్రీనివాస్ రవిరాజ్, రచ్చ మురళి, అరవింద్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలువురు

## తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- **8 తులాల బంగారు ఆభరణాలు చోరీ**

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన నాయిని పురుషోత్తం ఇంట్లో శనివారం ఉదయం చోరీ జరిగినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల సమయంలో తన ఇంటికి తాళం వేసుకొని మోర్తాడ్ మండలం దొన్పల్ గ్రామంలో ఉన్న అక్క దగ్గరికి వెళ్ళాడు. ఇంటి తాళం గుర్తుతెలియని వ్యక్తులు పగల గొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో గల బీరువాలో నుండి 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు తెలిపారు. సాయంత్రం బాధితుడు పురుషోత్తం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడం గమనించి లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బాధితుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించినట్లు ఆయన తెలిపారు.


బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ

## ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

- **జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి**

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా రైతాంగం లోవొల్టేజ్ విద్యుత్ ఇబ్బందులను గ్రహించి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో నూతనంగా ఆరు సబ్ స్టేషన్‌లో నిర్మాణానికి జిఓ విడుదల చేశారని తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్‌లో రైతు బజార్ వద్ద ఇండోర్ సబ్ స్టేషన్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కి, జిల్లా కాంగ్రెస్ నాయకులకు, మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, వరంగల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సబ్ స్టేషన్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్‌కి సూచించినట్టు తెలిపారు.

## ప్రభుత్వం పేదల ఇండ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలి

- **న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి**

**నవతెలంగాణ-ఆర్మూర్**

ప్రభుత్వం పేదల ఇండ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి దాసు అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ పథకంలో ఇండ్లు మంజూరు చేయించాలని కోరారు. పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్‌రెడ్డితో కలిసి పేదల సమస్య పరిష్కారం కోసం సంబంధిత జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి పరిష్కరించాలని దాసు కోరారు. గత బీఆర్ఎస్ పరిపాలనలో ఎమ్మెల్యే పేదల సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చి విస్మరించారని ఆయన తెలిపారు. 2008 నుంచి మామిడిపల్లి పేదలు పూరి గుడిసెలు నిర్మించుకొని అక్కడ నివాసముంటున్నారని అన్నారు. జిల్లా అధికారులు మారుతున్న పట్టాల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్ల పట్టాల సమస్య పట్టించుకుని పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేష్ బాబు, వెంకటేష్, గంగాధర్, రవి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

- **విద్యార్థులకు సమయం విలువ తెలియాల్సిన అవసరం ఉంది**
- **చాకలి ఐలమ్మ మహిళా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ**
- **వైభవంగా ప్రారంభమైన**

**విజయ్ పాఠశాల టాలెంట్ షో**

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

పట్టుదల ఒక సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులకు సమయం విలువ తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ అన్నారు. విజయ్ పాఠశాల 44 వ టాలెంట్ షో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, తెలుగు సినిమా ఇండస్ట్రీ పాటల రచయిత అండ్ సింగర్ మిట్టపల్లి సురేందర్, విజయ్ విద్యాసంస్థల కార్యదర్శి అమృతలత, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విజయ్ హై స్కూల్ 44 వ టాలెంట్ షో సందర్భంగా చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వాయిస్ ఛాన్సర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ మాట్లాడుతూ.. బడి అన్నా పిల్లలన్నా నాకెంతో ఇష్టం అని తెలిపారు. నిజామాబాద్ గడ్డపై అడుగు పెట్టగానే నా మనసులో నా తెలంగాణ కోటి రత్నాల వీణ అనే నానుడి గుర్తొచ్చి నా హృదయం ఆనందంతో నిండి పోయిందన్నారు. విజయ విద్యాసంస్థల్లో ఒక పండగ వాతావరణం కనిపించిందని, నలభై ఏండ్లుగా నడుపున్న విద్యావ్యవస్థ విజయ్ పాఠశాల అని అన్నారు. డాక్టర్ అమృతలత రచయితగా, రాజకీయ వేత్తగా వివిధ రంగాలలో ప్రవీణ్యురాలై విద్యార్థులను తీర్చి దిద్దుతున్న ఘనత ఆమెకే దక్కుతుందని చెప్పడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు వారి అనుభవాలను గుర్తు చేయాల్సిన బాధ్యత కలిగి ఉండాలని, తద్వారా విద్యార్థుల జీవితాల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నలభై ఏళ్లుగా విజయవంతంగా నడుపుతూ, సమాజంలో మంచి గుర్తింపును పొందడంలో విజయ్ హై స్కూల్ మహిళా శక్తిని నిరూపించు కుంటుందని తెలిపారు. ఆడపిల్లలని ఆదరించి వారికి ప్రోత్సహిస్తే వారి జీవితాల్లో వెలుగును నింపినవారౌతామని అన్నారు. అమృతలత అమ్మ ఒక సామాజిక వేత్తగానే కాకుండా అన్ని రకాలుగా గొప్ప మనస్తత్వం కలిగిన వారని పేర్కొన్నారు. పట్టుదల ఒక సంకల్పం ఉంటే ఏదైనా సాధించ వచ్చని అమృతలత జీవితంలో నిరూపితమైందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మరో అతిథి తెలుగు సినిమా ఇండస్ట్రీ పాటల రచయిత అండ్ సింగర్ మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలం గాణ ఉద్యమ గడ్డ నిజామాబాద్ జిల్లాలో విజయ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా బాగుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మంచి అనుభూతి లభిస్తుందన్నారు. చిన్నతనం నుండే విద్యార్థులు ప్రతిదీ నేర్చుకోవాలని అలా నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు గొప్పగా ఆలోచించగలుగుతారన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకు సాగాలన్నారు. వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు 2023-24 సంవత్స రానికి అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించారు. అనంతరం ముఖ్య అతిథులను విజయ్ పాఠశాల తరపున మెమె ంటో, శాలువాలతో సత్కరించారు. పాఠశాల కార్యదర్శి అమృతలత, రమాదేవి, లలిత దేవి, విజయ భారతి, విజయ లక్ష్మి, మధు, కరస్పాండెంట్ ప్రభాదేవి అకాడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


అతిథిని సన్మానిస్తున్న యాజమాన్యం


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

## సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిది

**నవతెలంగాణ-ఆర్మూర్**

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం అని న్యాయవాది జిల్లా సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ గటాడి ఆనంద్ అన్నారు. క్షత్రియ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థిని విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని, గ్రామస్థాయి నుండి మొదలుకొని పార్లమెంట్ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తమ కావాల్సిన సమాచారం ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. భారతదేశంలో అవినీతి అంతం చేయడంలో ఈ చట్టం ఎంతో దోహద పడుతుందని అన్నారు అలాగే సెక్షన్ 2జె(1) ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గంటసేపు ఉచితంగా రికార్డులు తనిఖీ చేసే అధికారం భారత రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. కోరిన సమాచారం 30 రోజుల్లో ఇవ్వాలని అనప్పారు. దరఖాస్తుదారునికి తప్పుడు, అసంపూర్తి సమాచారం ఇచ్చిన అధికారికి రోజుకు 250 నుండి 25 వేల వరకు జరిమానా విధించే అధికారం రాష్ట్ర కమిషన్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, లెక్చరర్లు రాజన్న, తిరుపతి వేణుగోపాల్, పిఠీ కత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

- **తెలంగాణ ఆల్ పెన్షనర్స్**


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ కోరారు. శనివారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో శనివారం మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఏలను విడుదల చేయాలని, నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమిటెడ్ వ్యాల్యూ ఆఫ్ పెన్షన్ రికవరీని 11 సంవత్సరాలకి కుదించాలని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే తప్పక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జిల్లా అధ్యక్షులు కే.రామ్మోహన్‌రావు, కోశాధికారి ఈవిల్ నారాయణ, నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, కార్యదర్శి ప్రసాద్‌రావు, జిల్లా నాయకులు లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, రాధా కిషన్, పూర్ణచంద్రరావు, భోజరావు, మహిపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఆవుపాలు శ్రేష్టమైనవి

- **గోపాష్టమిలో ఎమ్మెల్యే ధన్‌పాల్**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

గోవులను పూజించే గొప్ప సంస్కృతి భారత్‌లోనే ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ అన్నారు. శనివారం గోపాల్ బాగ్ గోశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గోపాష్టమి మహొత్సవం కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు ఇంటికో గోవు ఉండేదని ఇప్పుడు గోవులు అంతరించిపోతున్నాయని, గోవులను పెంచే బాధ్యత రక్షించాల్సిన బాధ్యత, అందరిపైన ఉంటుందని అన్నారు. తల్లి పాలకు సమానమైన ఆవు పాలు ఎంతో శ్రేష్ఠమైనవని అన్నారు. గోవులకు ఆక్సిడెంట్, అనారోగ్య సమయంలో ఉచితంగా తన ట్రస్ట్ ద్వారా వాహన సర్వీస్ అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గోమాతకు పూజ కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజా వెంకట్‌రెడ్డి, గోపాల్ బాగ్ గోశాల కమిటీ అధ్యక్షులు కోలా రామ్, కార్యదర్శి మాస్టర్ శంకర్, కమల్ ఇనాని, క్యాషియర్ ధన్పాల్ శ్రీనివాస్, ట్రస్టీ కైలాస్ బోయంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో చోరీ

**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్రానికి చెందిన లింగపురం దేవరాజ్ ఇంట్లో చోరీ జరిగింది. రెండు తులాల బంగారం, రూ.5 వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. శనివారం ఉదయం కుటుంబీకులు తమ సమీప బంధువుల శుభకార్యానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులగొట్టిన ఆనవాళ్లు ఉండడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- **బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి**
- **సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్**
- **బిసిటియు నూతన కార్యవర్గం ఏర్పాటు**

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక కేర్ డిగ్రీ కళాశాలలో బిసిటియు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బిసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సలహాదారులు రమణ స్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. బిసిటియు జిల్లా అధ్యక్షులుగా మాడవేడి వినోద్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్.గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మళ్లీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్న జిల్లా కార్యవర్గానికి ధన్యవాదాలు తెలియజేస్తూ నూతన పిఆర్సీని వెంటనే అమలు చేయాలని తెలిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, నాలుగు పెండింగ్ డిఏలను అమలు చేయాలని చెప్పారు. గురుకుల ఆదర్శ పాఠశాల, కెజిబివిల సమస్యలను పరిష్కరించాలని, బిసిలకు క్రిమిలేయర్ విధానాన్ని తొలగించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**బిసి ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఇదే..**

జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రవికుమార్, కె.రామకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా కే.బాబు, అసోసియేటెడ్ అధ్యక్షులు ఏ.మోహన్, ఉపాధ్యక్షులుగా యు.విజయ్ కుమార్, ఎం.మహేందర్, డి.శ్యాంప్రసాద్, జె.శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా బి.ప్రతిభ, జి.సప్న, కోశాధికారిగా డి.రాజు, కార్యదర్శులుగా పి.చంద్రశేఖర్, టి.వినోద్ కుమార్, ఎం.మాణిక్యం, ఎస్.సతీష్ కుమార్, మహిళా అధ్యక్షురాలిగా ననుగొండ విజయలక్ష్మి, గౌరవ సలహాదారులుగా కొట్టూరు రమేష్, వై.సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మేడిదాల ప్రవీణ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంబటి నర్సయ్య, వంగ శ్రీహరి, శ్రీనివాసరాజు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా బి.కళ్యాణి, ఎ.సబిత, రాష్ట్ర కార్యదర్శులు జి.కృష్ణాజి, ఎం.వేణుగోపాల్, రాష్ట్ర గౌరవ సలహాదారులుగా టి.రమణ స్వామి, ఏ శంకర్, డి.విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.


ఎన్నికైన కమిటీ సభ్యులు

## ప్రజలందరికీ సమన్యాయం కోసమే సమగ్ర సర్వే

- **కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి**


సమగ్ర సర్వే గురించి వివరిస్తున్న వినయ్‌రెడ్డి

**నవతెలంగాణ-ఆర్మూర్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతో రాష్ట్రంలోని ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో జరుగుతున్న సమగ్ర సర్వేలో ఆయన పాల్గొని స్థానిక ప్రజలకు సమగ్ర సర్వేపై విశ్లేషించారు. ఈ సర్వేతో సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కులగణన మొదలైన వివరాలతో పొందుపరచబడిన సమగ్ర సర్వే బుక్‌లెట్‌పై ప్రజలకు వివరించారు. పట్టణ కేంద్రంలోని పదవ వార్డులో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య, ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ షేక్ మున్ను, మున్సిపల్ కమిషనర్ ఏ.రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొంతం మంజుల మురళి, వనం శేఖర్, భాగ్యలక్ష్మి శివ, మాజీ వైస్ చైర్మన్ లింగగౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విప్లవోద్యమ నేత డీవీకే ఆలోచనల వ్యాప్తికి కృషి చేద్దాం

- **సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రామ్ చందర్**

**నవతెలంగాణ-ఆర్మూర్**

విప్లవోద్యమ నేత డీవీకే ఆలోచనల వ్యాప్తికి కృషి చేద్దామని సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ కేంద్రకమిటీ సభ్యులు కేజీ. రాంచందర్ అన్నారు.

పట్టణంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిన సభలో ఆయన మాట్లాడుతూ..కామ్రేడ్. కృష్ణ విప్లవ సైద్ధాంతికవేత్త అని, విప్లవ ఉద్దండుడని, ఆయన విప్లవ ఉద్యమాల వ్యాప్తి కోసం మరణం చివరి వరకు పరితపించిన మహోన్నతుడని అన్నారు. ఆయన పార్టీలో అతివాద మితవాద ధోరణులకు వ్యతిరేకంగా 1980 నుండి సైద్ధాంతిక పోరాటం చేశాడన్నారు. కమ్యూనిస్టు విప్లవకారులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంథా, కార్యక్రమంను రూపొందించుకుంటేనే పురోగతిలో ఉంటారని ఆయన డాక్యుమెంట్స్ ద్వారా ప్రపంచానికి చాటిన భారత విప్లవ పితామహుడు అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజల్లో విప్లవ రాజకీయాల ప్రచారం కోసం నడుం కట్టి పని చేశారన్నారు. ప్రజలు లేని విప్లవం విజయవంతం అవ్వలేదని, హీరోలు చరిత్రను మార్చలేరని డాకుమెంట్స్ తో ప్రజాపంథా వెలుగులో ప్రజాతంత్ర విప్లవం అన్న కొత్త సిద్ధాంతను రూపొందించిన రూపకర్త అన్నారు. ప్రజలు ప్రజా సంఘాల ద్వారా భారతదేశంలో బలమైన విప్లవ ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందని నిరూపించిన ఉత్తమ కమ్యూనిస్టు కామ్రేడ్. అని అన్నారు. కార్యక్రమం ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి డివి కృష్ణకు నివాళులర్పించారు. కార్యక్రమానికి డివిజన్ కార్యదర్శి దేవరాం అధ్యక్షత వహించగా, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కృష్ణ , డివి కృష్ణ కూతురు దివ్య, కృష్ణ తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డి, సహచరులు ఆశీర్వాదం, పద్మారావ్, నిమ్మ నారాయణ ప్రసంగించారు. జిల్లా కమిటీ సభ్యులు. ముత్తేన్న, గంగాధర్, మల్లేష్, రమేష్, సత్తేవ్వ, రాజేశ్వర్, కిషన్, గుమ్ముల గంగాధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు


డీవీకే విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు